
# డబ్ పార్టీ

మల్లాది వెంకట కృష్ణమూర్తి

**కృష్ణకాంత్ బేచులర్ ఆఫ్ ఆర్ట్స్ అయిన రోజే కనక దుర్గకి భర్త అయ్యాడు. అతను మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ అయిన రోజు కనకదుర్గకి సేవకుడయ్యాడు – అంటే ఆ రోజే ఆమెని కాపురానికి తీసుకు వచ్చాడు.**

ఆంధ్రలో మద్యపాన నిషేధం తీసేసిన శుభ సందర్భంలో కృష్ణకాంత్ ఇంట్లో మిత్రులమంతా బీర్ పార్టీలో కలిశాం. కనకదుర్గ రెండో కాన్పుకి పుట్టింటి కెళ్ళడంతో, మేం కృష్ణకాంత్ ఇంట్లో దుకాణం పెట్టడానికి వీలైంది.

మద్యపాన నిషేధం వచ్చాక అంతకు ముందులా ఫ్రండ్స్ అంతా రెగ్యులర్‌గా కలవడం తగ్గిపోయింది. దాన్ని తీసేయడంతో మళ్ళీ ఆంధ్రాలో స్నేహం పెంపొందుతుందని అంతా అనుకుని ఆ స్నేహానికి టేస్ట్ చేసి బీర్‌సిప్ చేశాం.



మొదటి సిప్ చేశాక రాంజో లేచి నిలబడి, మత్తొచ్చినట్లుగా నటిస్తూ చెప్పాడు.

'నిన్న తాగితే తప్పు, మళ్ళీ ఇయ్యాల మళ్ళీ తాగొచ్చేరా అంటే అది రైటూ? ఈడెవడ్రా నేనెప్పుడు తాగితే తప్పో, ఎప్పుడు తాగితే రైటో చెప్పడానికి. ఈడూ నాలాగా అబ్బ ఆవేశాలకే గందరా పుట్టింది. అవునంట్రూ?'

అంతా చప్పట్లుకొట్టాం.

'విస్కీ విస్కీనే. బీర్ బీరే' చెప్పాడు టెలిగ్రాం గాడు దాని రుచి చూశాక. కాలేజీలో అందరికన్నా ముందు వస్తూండే వాడు కాబట్టి వాడికా నిక్‌నేం పెట్టాం.

ప్రొహిబిషన్ అమలులో వుండగా మద్యపానంతో కలిగిన మా అనుభవాలు ఒక్కొక్కరు విప్పసాగాం.

'మద్రాస్ నించి పినాకిని ఎక్స్‌ప్రెస్‌లో నాలుగు వింటేజ్ విస్కీలు సంచీలో పెట్టి తెస్తున్నాను. సూళ్ళూరు పేట దాటాక వచ్చింది చెకింగ్ స్క్వాడ్. 'అదెవరిది, ఇదెవరిది?' అంటూ ఒక్కో సామాను చూపించి అడగసాగారు. అలా ఐడెంటిఫై చేసిన సామాను జోలికి వాళ్ళు పోవకపోవడం గమనించాను. దాంతో విడిగా ఏర్‌బేగ్‌లో ఆ సీసాలున్న సంచీ నాదేనని చెప్పాను. నేననుకున్నట్లుగానే వాళ్ళు దాన్ని తెరవ మనలేదు. ఓ సంచీని ఎవరూ క్లెయిమ్ చేయలేదు. దాన్ని వాళ్ళు తెరచి చూస్తే వి.ఎస్.ఓ.పి విస్కీ సీసాలు ఆరున్నాయి. నేమూ ఆ ఏర్‌బేగ్ నాది కాదంటే, తెరచి చూసి వాళ్ళు స్వాధీనం చేసుకునే వాళ్ళు' చెప్పాడు టెలిగ్రాంగాడు.

ఎక్సయిజ్ వాళ్ళకి ప్రతి వాళ్ళ సామాను తెరచి చూసేంత టైం వుండదు కాబట్టి దేంట్లో అక్రమ మద్యం వుందో తెలుసుకోవడానికి అది మంచి ట్రిక్ అనుకున్నాను.

'నాకూ ఇలాంటి అనుభవం ఒకటుంది' రాంజీ చెప్పసాగాడు.

'వైజాగ్‌లో హోటల్‌లో థర్డ్ ఫ్లోర్‌లోని మా గదిలో అప్పుడే మందు బాటిల్ ఓపెన్ చేశాం. కింద నుంచి రిసెప్షనిస్ట్ ఫోన్ చేసి ఎక్సయిజ్ పార్టీ వచ్చిందని చెప్పాడు. వెంటనే కిటికీ తెరచి ఫుల్ బాటిల్‌ని కిందపడేశాను. ధడేల్‌మన్న చప్పుడుతో అది పగిలింది. ఎక్సయిజ్ వాళ్ళకి ఆ చప్పుడు వినిపించింది. సెకండ్ ఫ్లోర్‌లోని రెండు గదుల్లో తాగి వున్న ఒకరిద్దరు దొరకడంతో మా ఫ్లోర్‌లోకే రావేలేదు. వాళ్ళే ఆ బాటిల్‌ని పారేసారనుకుని పట్టుకెళ్ళారు. మేం సేవ్ అయ్యాం' చెప్పాడు రాంజీ నవ్వుతూ.

కృష్ణకాంత్ చిన్నగా దగ్గి చెప్పాడు.

'నేను బెంగుళూరు నుంచి వస్తూ బిస్లరీ వాటర్ బాటిల్‌ని ఖాళీ చేసి అందులో జిన్‌ని సగం దాకా నింపుకొచ్చాను. రైల్లో చెకింగ్ జరగలేదు కాని రైలు దిగి స్టేషన్‌లోంచి బయటకి వస్తూంటే ఎక్సయిజ్ వాళ్ళు రేండమ్ చెకింగ్ చేశారు. నా సూట్ కేస్‌లో వాళ్ళకేం దొరకలేదు. బిస్లరి బాటిల్‌లోది మంచినీళ్ళనుకుని వుంటారు. దాన్ని మూత తెరచి వాసనే చూళ్ళేదు.'

'ఇలాగే నేనోసారి బీర్‌ని ఫ్లాస్క్‌లో పోసి తెచ్చుకున్నాను. మా రైలెక్కిన చెకింగ్ స్క్వాడ్ కూడా సూట్ కేస్‌లు, ఎయిర్ బేగ్స్ తప్ప కొక్కేనికి వేలాడే ఆ ఫ్లాస్క్‌ని చెక్ చేయలేదు' చెప్పాను నేను.

'కాని నాకో చిత్రమైన, రేదర్ పెయిన్‌ఫుల్ ఎక్స్‌పీరియన్స్ గండిపేట గెస్ట్‌హౌస్‌లో అయింది' చెప్పాడు కృష్ణకాంత్.

అంతా అతని వంక చూశాం. అతని మొహం కొద్దిగా ఎర్రబడి వుంది.

'ఎక్సయిజ్ పోలీసు స్టేషన్‌కి తీసుకెళ్ళారా?' అడిగాడు టెలిగ్రాం గాడు. 'కాదు. అసలు ఎక్సయిజ్ అండ్ ప్రొహిబిషన్ వాళ్ళకీ, నా ఎక్స్‌పీరియన్స్‌కీ సంబంధం లేదు'.

ఇంకో రెండు బీర్లు ఓపెన్ చేసి వాటిని మా నలుగురి ఖాళీ మగ్స్‌లో పోసి మళ్ళీ చెప్పసాగాడు కృష్ణకాంత్.

'నా కొలీగ్ ఒకడు తన పుట్టిన రోజుకి మందు పార్టీని ఏర్పాటు చేశాడు. గోల్కొండలోని ఓ గెస్ట్ హౌస్‌లో ఓ గదిలో బుక్ చేశాడు. డిఫెన్స్ కాంటీన్ సర్వీసెస్‌లో అమ్మే 'గోల్డెన్ ఛారియెట్' విస్కీ సీసాలు రెండు వచ్చాయి. మొత్తం ఆరుగురం పోగయ్యాం. ఆ రాత్రి పార్టీ ఘనంగా జరిగింది. కుందేలు మాంసం ఫ్రై, అన్నంలోకి ఉడుము కూరలతో...

'ఉముదు కూరా?' అసహ్యంగా మొహం పెట్టి అడిగాడు టెలిగ్రాంగాడు.

'అవును. నాకు అది తినడం మొదటి సారే. ఎంతో టేస్టీగా వుంటుంది తెలుసా? చికెన్ దాని ముందు బలాదూర్ అనుకో. గెస్ట్ హౌస్ కీపర్ వుండాడు దాన్ని. అంతా గుడ్‌నైట్ చెప్పి పడుకున్నాం. మర్నాడు ఎప్పటిలో అయిదున్నరకే మెలకువ వచ్చింది నాకు. బయట ఫ్రెష్ ఎయిర్ కాబట్టి వాకింగ్‌కి బయలుదేరాను. మా గెస్ట్‌హౌస్‌కి అరకిలోమీటర్ దూరంలో జరిగిందా పెయిన్‌ఫుల్

ఎక్స్‌పీరియన్స్.'

కృష్ణకాంత్ మొహంలో సిగ్గులాంటిది ఇంకాస్త ఎక్కువగా తొంగి చూడడంతో అంతా అతని వంక ప్రశ్నార్థకంగా చూశాం. 'మా గెస్ట్ హౌస్ ఎదురుగా వున్న మెయిన్ రోడ్డు ఎక్కి అర కిలో మీటర్ దూరంలో వున్న బండ్ రోడ్డు మీదకి చేరుకున్నాను. నేనక్కడికి చేరుకునే సరికి వెలుగు వస్తోంది' చెప్పడం ఆపాడు. అతని మొహంలోని భావాలని బట్టి అక్కడేదో ఇబ్బందికరమైందే జరిగిందనిపించింది నాకు. మగ్‌లోని బీర్‌ని సగం దాకా గటగటా తాగేసి, మూతిని ఎడం ముంజేతితో తుడుచుకుని మళ్ళీ చెప్పసాగాడు.

'అకస్మాత్తుగా వెనక నించి వచ్చినెవరో గట్టిగా పట్టుకున్నారు. ఏం జరుగుతుందో తెలిసేలోగానే నా మెడ కింద చేతిని వేసి నొక్కి పట్టుకున్నారు. ఇద్దరు. ఒకడు నా రెండు చేతులని విడిచి పట్టుకున్నాడు. నేనరవకుండా నోరు నొక్కారు. దారి దొంగలనుకున్నాను నేను.

రాత్రి వేసుకున్న నా పైజమాకి జేబే లేదు. చొక్కా జేబులో పది... పదిహేను రూపాయల చిల్లర మినహా ఇంకేం లేదు కాబట్టి అమ్మయ్య అనుకున్నాను. అదే పేంట్‌తో వచ్చివుంటే ఆ జేబులోని పర్స్‌లోని క్రెడిట్ కార్డ్స్, అయిదారు వందలు పోయి వుండేవి. పక్కనే ఆగి వున్న ఓ అంబాసిడర్ కారు చాటుకి లాక్కెళ్ళారు నన్ను వాళ్ళు. నా నడుం మీద మూడో వ్యక్తి ఎవరో కాలుంచి ఒంగున్న పొజిషన్‌లోంచి నేను లేవకుండా అదిమి పట్టాడు. నా తల మీద బరువైన దెబ్బపడింది. కళ్ళు చీకట్లు కమ్మాయి. నాకు స్పృహ తప్పింది.'

కృష్ణకాంత్ మొహంలోకి స్వల్పంగా అవమాన భావం ప్రవేశించింది. ఆ తరువాత జరిగింది చెప్తూంటే.



'పది నిముషాల్లో నాకు మెలకువ వచ్చి వుంటుందనుకుంటాను. కళ్ళు తెరచి చూస్తే రోడ్డు మీద పడివున్నాను. ఆశ్చర్యం! నా వంటి మీద నూలు పోగు లేదు. షర్ట్, బనీను, పైజమా, అండర్‌వేర్ ఏవీ లేవు. ఆఖరికి మొలతాడు కూడా లేదు'.

'ఈ జిట్?' అడిగాడు రాంజీ ఆశ్చర్యంగా.

ఆ ప్రశ్నని పట్టించుకోకుండా చెప్పకెళ్ళసాగాడు కృష్ణకాంత్. 'నెమ్మదిగా లేచాను. తల మీద దెబ్బ పడ్డ చోట బొప్పికట్టింది.. నా పొట్టమీద స్కెచ్ పెన్‌తో ఏదో రాసి వుండడం గమనించి దాన్ని తుడుచుకోడానికి విశ్వప్రయత్నం చేశాను. కాని అది నేను అనుకున్నట్లుగా స్కెచ్ పెన్ కాదు' ఆగి ఓ గుటకలేసి మళ్ళీ చెప్పసాగాడు. 'చివరి అక్షరం 'టీ' గీత నా బొడ్డు దాకా గీశారు. అక్కడ కిందకి బాణం గుర్తు పెట్టారు'.

అంతా ఆశ్చర్యంగా ఒకరి మొహాలొకరం చూసుకున్నాం.

'తరువాత?' అడిగాడు టెలిగ్రాంగాడు ఆసక్తిగా.

'క్రమంగా ట్రాఫిక్ రద్దీ పెరగసాగింది. పాలకేన్స్‌తో సైకిళ్ళ మీద మిల్క్ సప్లయర్స్ తిరగసాగారు. ఇంకా స్కూటర్స్ మీద మనుషులు, ఓ ఆర్.టి.సి.బస్సులోంచి ప్రయాణీకులు నా వంక చూసి ఈలలు వేశారు. గెస్ట్‌హౌస్ చేరుకోవాలంటే మెయిన్ రోడ్ ఒకటే గతి. అంతా ఆగి నా వంక ఆశ్చర్యంగా, హేళనగా చూడసాగారు. రోడ్డు పక్కన వున్న ఓ చెట్టు కొమ్మని కోసి, దాన్ని అడ్డం పెట్టుకున్నాను. గెస్ట్‌హౌస్‌కి వచ్చి పడే దాకా నా అప్పటి అనుభవం ఇంకా గుర్తే' 'కృష్ణకాంత్ ఎంతో సిగ్గుగా చెప్పాడు. అతను మగ్‌లో మిగిలిన బీర్ తాగాడు. మళ్ళీ అందరి మగ్స్‌లో బీర్‌ని సర్వ్ చేశాను నేను.

'గెస్ట్‌హౌస్‌కి చేరుకునే సరికి అయిదారుగురు పిల్లలు ఎగతాళి చేస్తూ నా వెంటనే వచ్చారు. హాల్లో బ్రేక్ ఫాస్ట్ చేస్తున్న నా మిత్రులు నా వంక తెల్లబోయి చూశారు. నేను అక్కడ సోఫా మీది కుషన్స్ రెండు తీసి ముందు వెనక అడ్డు పెట్టుకున్నాను. వాళ్ళడిగే ప్రశ్నలకి జవాబివ్వకుండా పైకి పరిగెత్తాను. నా గదిలోకి వెళ్ళి పేంట్ వేసుకున్నాక కాని నేను మామూలు మనిషిని కాలేకపోయాను.

'అద్దంలో చూసుకుంటే నా వీపు మీద కూడా ఏదో రాసి వుంది. బాణం గుర్తు కిందకి వుంది. ఈలోగా నా మిత్రులు గదిలోకి వచ్చారు జరిగింది క్లుప్తంగా వివరించాను. వాళ్ళు దొంగలై వుంటారని, నా చొక్కా జేబులో డబ్బు తక్కువ వుండడం చూసి కోపంలో అలా రాసి వుంటారని తీర్మానించుకున్నాం. ఓ ఫ్రెండ్ వంటి మీది బనీన్ తొడుక్కున్నాను నేను రెండో చొక్కా లేకపోవడంతో. పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి జరిగింది రిపోర్టిచ్చాం.'

'మద్యపానం చేశావని దాన్ని హేట్ చేసే వాళ్ళెవ్వరైనా ఆ పని చేసి వుండచ్చు' చెప్పాడు రాంజీ కొద్ది క్షణాల తరువాత.

'ఏమో మరి? పోలీసులు ఆ నేరస్తులని పట్టుకున్నట్టుగా నాకు ఇంత దాక ఇన్‌ఫాం చేయలేదు. నేను మళ్ళీ ఎంక్వయిరీ చేయలేదు.'

ఆ సంఘటన మీద నలుగురం చర్చించాం. ఆ పని చేసిన వాళ్ళు చదువుకున్న వారని, సెన్సాఫ్ హ్యూమర్ వున్న వాళ్ళని తీర్మానించుకున్నాం. ఆ సమయంలో వాళ్ళు తాగి వుండచ్చని, రాత్రంతా, ఆ కార్లో ఆ తాగి, బయలుదేరే ముందు ఆ



**నిరీక్షిస్తూ**

నీకోసం ఎదురుచూస్తాను
కలుసుకొంటే ఏముందీ
ఇద్దరు మానవులూ ఒక సంభాషణా
ఊరికే కలిసే సరదాకి
ఒకరికొకరు వెదికితే
విస్మయం చెందే రోజులలో
ఎదురుచూపు అంతకన్నా విస్మయకరమూ
అందమైన సంగతీ.
ఎండిపోతున్న చెట్లకి పూచే
చివరి రెండుపూలలా
మాటలకో, మౌనానికో
మనం వికసించే తొందర
నిరీక్షణ నాలోని
ప్రాచీన కాలాల మానవ పరిమళాన్ని
మేల్కొలుపుతూ వుంటుంది
బయటి శూన్యం నించి ముడుచుకొంటూ
నేను నీకోసం
లోపలి సమస్తం తెరచి వెదుకుతాను
తీరా నువ్వు వచ్చేసరికి
నేను లోపలెక్కడో వుంటాను.
బహుశా
అది మనం ఎప్పుడూ కలిసి వుండే చోటు
అంతే కదూ!

——బి.వి.వి ప్రసాద్

నిషాలో కృష్ణకాంత్ కనబడితే ఆ పని చేసుంటారని టెలిగ్రాం గాడు తన అభిప్రాయం చెప్పాడు.

'ఈ సంగతి ఇంకా ఎవరికి తెలుసు?' అడిగాను కృష్ణకాంత్‌ని.

'మా ఆవిడకి నా ఆఫీస్‌లోని ఆ నలుగురు కొలీగ్స్‌కి. మా కొలీగ్స్) ఇంకెవరికీ జరిగింది చెప్పొద్దని కోరాను. వాళ్ళు ఆ మాట మీదే వున్నారు.'

బీర్ పూర్తయింది. డోర్‌బెల్ మోగింది. అంతా ఒక్కసారిగా వులిక్కిపడ్డాం. అంతలోనే బయటకి గట్టిగా నవ్వేశాం. మద్య నిషేధం ఇరవై ఆరు నెలలుగా అమలులో వుంది. కాబట్టి మందుకొడుతూండగా అలా డోర్ బెల్ మోగితే ఉలిక్కి పడడం అలవాటు మరి.

కృష్ణకాంత్ తమ కాలనీలోని స్టూడెంట్స్ మెస్ ప్రొప్రయిటర్‌కి ముందే మా భోజనాలకి డబ్బు, క్యారేజ్ ఇచ్చి వచ్చాడు. చెప్పిన టైంకి కేరేజి తెచ్చాడతను.

'ఫిష్షా?' కారేజీ మూత తెరవగానే వాసన రావడంతో అడిగాడు రాంజీ. 'అవును మన కోసం ప్రత్యేకంగా ఫిష్ కర్రీ చేయించాను' చెప్పాడు కృష్ణకాంత్.

'ఇంకోటుంటే బావుండేది. ఇంతకాలం జైల్లో వుండి ఇప్పుడు విడుదలైనట్లుగా వుంది.' చెప్పాడు రాంజీ బీర్ మొత్తం గడగడా తాగి.

'ఫ్రండ్స్, సర్‌ప్రయిజ్' కృష్ణకాంత్ ఫ్రిజ్‌లోని ఆఖరి బీర్‌ని బయటికి తీసి అరిచాడు. బదులుగా అంతా ఆనందంగా అరిచాం.

కృష్ణకాంత్‌కి జరిగిన అనుభవం ఓ పట్టాన నేను మర్చిపోలేకపోయాను. అతన్ని ఆ విధంగా ఎవరు చేశారో తెలిస్తే బహుశా మర్చిపోయేవాడ్నేమో కాని ఆ ప్రశ్నకి సమాధానం తెలీకపోవడంతో అది మదిలో మెదలుతూనే వుంది.

* * *

నేను పని చేసే కంపెనీ మా ఫ్యాక్టరీకి హాలండ్ నించి కొంత మెషినరీని దిగుమతి చేసుకుంటోంది. ఆ మెషినరీ ఎరక్షన్ ఆపరేషన్ మీద నాతో పాటు ఆరుగుర్ని ఆమ్‌స్టర్ డామ్‌కి పంపించారు మా కంపెనీ వాళ్ళు.

బాంబేలోని లుఫ్తాన్స ఎయిర్‌లైన్స్ విమానం తెల్లారు ఝామున నాలుగున్నరకి ఎక్కాం. ఎయిర్ హోస్టెస్ అందరికి ఆ రోజు ప్రెస్ నించి తాజాగా వచ్చిన టైమ్స్ ఆఫ్ ఇండియా దినపత్రిక లిచ్చింది.

వారానికి అయిదు రోజులు, రోజుకి పది గంటలు హాలండ్‌లోని ఫ్యాక్టరీలో ఆ శిక్షణ తీసుకున్నాం. నాకు పీటర్ అనే వ్యక్తితో బాగా దోస్తీ ఏర్పడింది. అతని పుట్టిన రోజుకి అతని ఫ్లేట్‌కి నన్ను డచ్ పార్టీకి పిలిచాడు. డ్రింక్స్ సర్వ్ చేశాక అతను స్వతహాగా హాస్యప్రియుడు కాబట్టి ఓ కేసెట్ పెట్టాడు.

వీడియో షూటింగ్ అని తెలీకుండా రకరకాల మనుషులు, రకరకాల సిట్యుయేషన్స్‌లో వుంచి, వాళ్ళకి తెలీకుండా తీసిన సన్నివేశాలవి. మీ ఊహ కరెక్టే. ఎక్కడ హైదరాబాద్ అవుట్ స్కర్ట్స్‌లోని గోల్కొండ ఎక్కడ ఆమ్‌స్టర్ డామ్? ఆ అయిదు నిముషాల ఎపిసోడ్‌లో మా కృష్ణకాంత్‌ని పట్టుకున్నప్పటి నుంచి తిరిగి పేంట్ తొడుక్కునే దాకా తీసిన దృశ్యాలు నీట్‌గా ఎడిట్ చేయబడ్డాయి.

తన నగ్నత్వానికి సిగ్గుపడుతూ అతను గెస్ట్‌హౌస్‌కి చేరుకునేలోగా రోడ్డుమీద వాళ్ళ రియాక్షన్స్, గెస్ట్ హౌస్‌లో మిత్రుల, సర్వెంట్స్ రియాక్షన్స్ మొత్తం చూసి పగలబడి నవ్వుతున్నారంతా. ఓ పథకం ప్రకారం ముందే గెస్ట్‌హౌస్‌లో కూడా కెమెరాలు రహస్యంగా సిద్ధంగా చేసి షూట్ చేశారని ఇట్టే గ్రహించాను.

తరువాత సరిగ్గా అలాంటి సంఘటనలు బ్రిటన్, సౌత్ ఆఫ్రికా, హాంకాంగ్‌లలో జరిగినవి చూపించారు. ఓ అంతర్జాతీయ ముఠా ఆ కేండిడ్ కెమెరా నిర్మాతలై వుంటారనిపించింది నాకు. దాని ఏజెంట్స్ హైదరాబాద్‌లో వుండి వుంటారు.

తిరిగి వచ్చాక ఆ కేండిడ్ కెమెరా గురించి కృష్ణకాంత్‌కి చెప్పనే లేదు నేను. జీవితాంతం అతను అవమానంతో కూడిన బాధతో కుళ్ళకూడదని. ఎందుకంటే అతని పొట్టమీద, వీపు మీద కృష్ణకాంత్ చెప్పినట్లుగానే ఏదో రాసి వుంది. ఆఖరి అక్షరాలకిచ్చిన బాణం గుర్తు అతని బొడ్డు కింద వైపు, వీపు కింది భాగాన్ని సూచిస్తున్నాయి. డచ్ భాషలో ఏం రాసి వుందని అడిగాను పీటర్‌ని.

పొట్టమీద ఇడియెట్ అని, వీపు మీద ఏస్‌హోల్ అని రాసి వున్నాయని నవ్వుతూ చెప్పాడతను.

బాంబే నించి హైదరాబాద్‌కి తిరిగి వస్తూంటే, ఎయిర్ హోస్టెస్ ఇచ్చిన 'టైమ్స్ ఆఫ్ ఇండియా'లో ఓ వార్త నా వెంట పడింది.

బాంబే ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ 'బెస్ట్'లో పనిచేసే ఓ ఉద్యోగికి, మా కృష్ణకాంత్‌కి జరిగిన అనుభవం లాంటిదే జరిగితే పోలీస్‌లకి రిపోర్టిచ్చాడని, కేసు పరిశోధన సాగుతోందని ఆ వార్తలో వుంది. ●